## ఎన్ఆర్ఈసీలో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్ ముగింపులో అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు సాగిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. సొసైటల్ అప్లికేషన్ ఆఫ్ ఏఐ అండ్ ఎంఎల్ ఇన్ సివిల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ అనే అంశంపై కొనసాగుతున్న వర్క్‌షాప్‌లో కళాశాల సెక్రటరి త్రిశూల్‌రెడ్డి మాట్లాడారు. ఇలాంటి వర్క్‌షాప్‌ల ద్వారా నూతన సాంకేతికతను భావితరాలకు అందించేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్ లోకనాథం సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా పడిపూజ



ఘట్‌కేసర్: శ్రీధర్మశాస్త సేవా సమితి సభ్యుడు పాటి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదో మహా పడిపూజను ఎన్ఎఫ్‌సీనగర్‌లోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయులు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామిని, 18 మెట్లను పూలు, దీపాలతో అందంగా అలంకరించి వేదికపై ప్రతిష్ఠించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డి స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## వికలాంగుల దినోత్సవ వేడుకలు



బహుమతులు అందజేస్తున్న కౌన్సిలర్ సాయిరెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని దివ్యాంగుల కాలనీలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్లు బాల్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో వికలాంగులు రాణిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం వికలాంగులకు బహుమతులను అందజేసి, అన్నదానం చేశారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం



అవుషాపూర్ విద్యుత్ సమస్యలు తెలుసుకుంటున్న ఏఈ సతీశ్‌కుమార్

ఘట్‌కేసర్: గ్రామంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పరిష్కరిస్తామని ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ ఏఈ సతీశ్‌కుమార్ అన్నారు. అవుషాపూర్‌లో స్థానికుల ఫిర్యాదు సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డితో కలిసి శనివారం గ్రామంలో పర్యటించి విద్యుత్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ బిగించి లో ఓల్టేజ్ సమస్య తలెత్తకుండా చేస్తామని ఏఈ హామీ ఇచ్చారు. నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

## ప్రతిరోజూ వ్యాయామం చేయాలి

బోడుప్పల్: విద్యార్థులు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఫిట్ ఇండియా వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. 1వ నుంచి 10వ తరగతి విద్యార్థులు డంబుల్స్, మాక్‌డ్రిల్, మారథాన్ వంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నట్లు వెల్లడించారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి చదువుతోపాటు ఆరోగ్యవంతంగా ఉండేందుకు వ్యాయామం, యోగా, వాకింగ్ చేయాలని సూచించారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి

బోడుప్పల్: దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. గౌతమినగర్ కాలనీలోని శ్రీకనకదుర్గ మాత దేవాలయం పునర్నిర్మాణం సందర్భంగా భూమి పూజకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంత నిలయాలుగా ఉండాలని, సమాజంలో ప్రతిఒక్కరూ దైవ చింతన కలిగి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షులు పీజీ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి దుర్గయ్య, సలహాదారులు గఫార్, కాలనీవాసులు సారయ్య, ముత్యాలు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు నివారణకు చర్యలు

గౌతంనగర్: డివిజన్‌లో దశాబ్ద కాలంగా ముంపు సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. కార్పొరేటర్ అభ్యర్థన మేరకు మల్లికార్జునగర్, మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే శాఖవారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్యాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతంనగర్ డివిజన్‌లో దశాబ్ద కాలంగా వరద, డ్రైనేజీ నీటి ప్రవాహానికి రైల్వే ట్రాక్ కింది నుంచి సరైన మార్గం లేకపోవడంతో గతంలో రైల్వే శాఖ అధికారులను సంప్రదించామని తెలిపారు. దీంతో రూ.2 కోట్లతో రైల్వే ట్రాక్ కింది నుంచి అండర్ గ్రౌండ్ బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు.


## డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలి

మల్లాపూర్: మల్లాపూర్ అశోక్‌నగర్ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం అశోక్‌నగర్ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సందీప్, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ ద్వార దర్శనం.. మహాభాగ్యం



రత్నాలయంలో స్వామివారి సేవలో భక్తులు





చీర్యాల స్వామిసేవలో నవీన్‌మిట్టల్ దంపతులు



స్వామిసేవలో సినీనటుడు బాబుమోహన్



రావల్‌కోల్ జయదర్శిని ఆలయంలో..

మేడ్చల్ జోన్ బృందం, కీసర: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవాలయం, దమ్మాయిగూడ వేంకటేశ్వరస్వామి దేవాలయం, ప్రజయ్‌సాయి గార్డెన్‌లో రామాలయం, కీసరగుట్టలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయం, రాంపల్లిలోని రామాలయం, కీసర రామాలయంలో శనివారం వేదపండితులు స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. చీర్యాల దేవాలయంలో సుదర్శనారసింహ హోమం నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకున్నారు.

**చీర్యాల స్వామిసేవలో నవీన్‌మిట్టల్..**

చీర్యాల లక్ష్మీనృసింహస్వామి సేవలో తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన నవీన్ మిట్టల్ దంపతులకు ఆలయ వేదపండితులు పూర్ణకుంభస్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ స్వామివారి ఆశీర్వచనంతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. మాజీ మంత్రి, సినీనటుడు బాబుమోహన్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.



మేడ్చల్ రంగనాయక స్వామి



యంనంపేట్‌లోని రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్



ఘట్‌కేసర్ గీతామందిర్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య



ఎదులాబాద్‌లో గోదాదేవి అమ్మవారి ఊరేగింపు



చీర్యాల దేవాలయంలో సుదర్శనారసింహ హోమం

## నాగారం సెరినిటీ పాఠశాల్లో క్రిస్మస్ వేడుకలు



నాగారంలోని సెరినిటీ పాఠశాల్లో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కానుకలను అందజేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

కీసర: నాగారం సెరినిటీ పాఠశాల్లో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆర్ఎల్‌నగర్, ఐకాం కంపెనీ సమీపంలోని అనాథాశ్రమాల్లో చిన్నారులు తమ తోటి విద్యార్థులతో కలిసి దుప్పట్లు, సబ్బులు, బిస్కెట్లు తదితర వస్తువులను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, ముఖ్యకార్యదర్శి నోముల వసంత తదితరులు పాల్గొన్నారు.

**క్రిస్మస్ కానుకల పంపిణీ**

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని 35 చర్చిలకు చెందిన సుమారు 200 మంది క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలను చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్ వేడుకలను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. కమిషనర్ వేమన రెడ్డి, కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, బాలగోని వెంకటేశ్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు అక్రమ్ అలీ, నాయకులు ఆకిటి బాల్‌రెడ్డి, నర్రి కాశయ్య, అబ్బవతిని నర్సింహ, మోటుపల్లి శ్రీనివాస్, పాస్టర్లు, క్రైస్తవులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# కోవిడ్ చికిత్సకు సర్వం సిద్ధం

- మూడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 70 పడకలతో ప్రత్యేక వార్డులు
- ఆక్సిజన్ కొరత లేకుండా చర్యలు
- నిర్ధారణ పరీక్షలకు ప్రత్యేక విభాగం



సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో మరోమారు కోవిడ్ కేసులు బయట పడుతుండటంతో వైద్యాధికారులు అప్రమత్తం అవుతున్నారు. గతంలో కోవిడ్ మొదటి, రెండో విడత వ్యాప్తిని దృష్టిలో పెట్టుకుని మల్కాజిగిరి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో 50 పడకలు, ఘట్‌కేసర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 10, మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 10 పడకలతో ప్రత్యేక వార్డులను సిద్ధం చేశారు. అలాగే, 108 బస్తీ దవాఖానాలు, 38 ప్రభుత్వ గ్రామీణ/పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు 126 ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా కోవిడ్ వైద్య చికిత్సల కోసం ఏర్పాట్లు చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కరోనా చికిత్స కోసం మొత్తంగా 8,197 పడకలను సిద్ధం చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. ఒక్కో పడకకు విధిగా ఆక్సిజన్ సదుపాయం కల్పిస్తున్నారు. ఐసీయూ విభాగంలో 408 వెంటిలేటర్లు అందుబాటులో ఉంచారు.

**ఆక్సిజన్ కొరత లేకుండా..**

- కరోనా తొలి విడతలో తీసుకున్న చర్యలు ఇప్పుడు కూడా అమలు చేయనున్నారు. ఆక్సిజన్ కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆక్సిజన్ సపోర్టు ఉన్న పడకలను 2,541 సిద్ధం చేసినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. వార్డుల్లో రోగులకు సేవలందించేందుకు 2,071మంది వైద్యులు, 3,261మంది నర్సులు, 1,374 మంది పారామెడికల్ సిబ్బందితో సహా అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్, శానిటేషన్ సిబ్బందిని కేటాయించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశారు.

**నిర్ధారణ పరీక్షలకు ప్రత్యేక విభాగం**

- ప్రభుత్వ ఆస్పత్రిలో కోవిడ్ నిర్ధారణ పరీక్షల నిర్వహణకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. అలాగే, పీపీఈ కిట్లు 33,988, ఎన్–95 మాస్కులు 55,681 అందుబాటులో ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. శ్వాసకోశ సహాయక పరికరాలు కూడా అందుబాటులో ఉంచారు. ఇందులో వెంటిలేటర్లు 407, నెబ్యులైజర్లు 1,134, ఆక్సీమీటర్లు 3,400, ఆక్సిజన్ కాన్సంటెటర్లు 1,129, ఆక్సిజన్ సిలిండర్లు 4,967 అందుబాటులో ఉంచినట్లు వైద్యశాఖ వర్గాలు తెలిపాయి.

# పర్యావరణ పరిరక్షణకు కృషిచేద్దాం..

**అరుణోదయ ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**

జవహర్‌నగర్: పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని మేయర్ మేకల కావ్య అన్నారు. అరుణోదయ ట్రస్టు చైర్మన్ వెంకటరావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం.. పర్యావరణాన్ని రక్షించుకుందామనే నినాదంతో శనివారం జవహర్‌నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ కావ్య హాజరై మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌తో ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్లాస్టిక్‌ను నిషేదిద్దామని ప్రపంచాన్ని రక్షించుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్ సంగీతరాజశేఖర్, కో–ఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, అరుణోదయ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మేయర్ కావ్య, అరుణోదయ ట్రస్టు సభ్యులు

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అంకుషాపూర్‌లో స్క్రీన్‌పై కేంద్ర పథకాలను తిలకిస్తున్న స్థానికులు

**ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి**

ఘట్‌కేసర్: పేదల కోసం కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం అంకుషాపూర్ గ్రామానికి చేరుకోగా ఎంపీటీసీ శోభారాణితో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాలను స్క్రీన్‌పై ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, గరీబీ కల్యాణ్ యోజన, ఫసల్ బీమా యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ యోజన, బేటీ పడావో, బేటీ బచావో, ప్రధాన మంత్రి మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ తదితర పథకాలకు సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కేంద్రం ఇస్తోందన్నారు. కేంద్ర పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ నందకిశోర్, బుచ్చిరెడ్డి, ఏఓ బాసిత్, ఏఈఓ జగదీశ్, బుచ్చిరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో ప్రీ లోక్ అదాలత్

- 2,351 కేసులు పరిష్కారం

కుషాయిగూడ: జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో ప్రీ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. 2,351 కేసులకు పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.మధుసూదన్‌రావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. ఈ నెల 30న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో ఈ ప్రీ లోక్ అదాలత్ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి జె.విక్రమ్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి మహేష్‌నాథ్, న్యాయమూర్తులు అరుణ్‌తేజ్, దేవి మానస, చిరాగ్ మెహతా, లక్ష్మీకళ, డీసీపీ జానకి, అడిషన్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ రవీందర్ పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ఆవరణలో ప్రీ లోక్ అదాలత్

## ఉత్సాహంగా క్రీడా పోటీలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 3వ డివిజన్ కార్పొరేటర్ శారధా ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడా పోటీలను శనివారం మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. పోటీలు ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నట్లు, ఈ పోటీలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు బైటింటి ఈశ్వర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, 3వ డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి



## మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నేతలు



ఉప్పల్: ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నేత మందుముల పరమేశ్వర్‌రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ నేతలతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నేతలు మధుయాష్కీగౌడ్, మలిపెద్ది సుధీర్‌రెడ్డి కలిసి పూలబొకే అందజేశారు. నియోజకవర్గాల వారీగా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కాప్రా: ప్రేమ కంటి చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఏఎస్‌రావునగర్‌లో ఉచిత కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ డీఎస్.మిట్టా తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా అర్హులైన పేదలకు, తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి ఉచిత కంటి ఆపరేషన్ల కోసం కంటి చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉచితంగా కంటి పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు ఏఎస్‌రావునగర్‌లోని క్రోమా షాపింగ్ మాల్ వెనుక ఉన్న ప్రేమ కంటి ఆస్పత్రిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్: 040–27127919, 99669 92368.

## ఉల్లాసంగా యువజన ఉత్సవాలు

**కలెక్టరేట్‌లో ప్రారంభించిన డీఆర్‌వో హరిప్రియ**

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా జిల్లాలోని యువతీ యువకులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రధానంగా జానపద గీతాలు, జానపద నృత్యాలు, కథా రచనలు, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ అంశాలున్నాయి. పోటీలను డీఆర్‌వో హరిప్రియ ప్రారంభించగా శామీర్‌పేట జెడ్పీటీసీ జ్యోతి వెలిగించారు. జిల్లావ్యాప్తంగా వివిధ విద్యా సంస్థలు, అసోసియేషన్స్ నుంచి దాదాపు 200 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. పోటీల్లో జిల్లాస్థాయి విజేతలను ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. వివిధ అంశాలలో నిర్వహించిన పోటీల్లో విన్నర్స్, రన్నర్స్‌తో కలిపి 30 మంది యువతీ, యువకులు గెలుపొందారు. పోటీల్లో గెలుపొందిన విన్నర్స్, రన్నర్స్‌కు జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, జిల్లా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ వినోద్ కుమారులు సర్టిఫికెట్స్, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి బలరామారావు, శాఖ అధికారులు జానకిరాములు, సిబ్బంది సాయి కుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు సన్మానం

ఉప్పల్: తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఉప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఉప్పల్ బీరప్పగడ్డలో బీరప్ప ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు గొంగడి, గొర్రె పిల్లను బహూకరించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ కురుమలకు ఏ ఇబ్బంది వచ్చిన ఆదుకుంటానన్నారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి, నర్రి యాదయ్య, ఎంసెట్ కన్వీనర్ రాములు, ఏసీపీ కురుమ రమేష్‌ను సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గొరిగే రమేష్, కార్యదర్శి గొరిగే మల్లేష్, రేవు కృష్ణయ్య, చౌదరిపల్లి పర్వతాలు, చిందం వెంకటేష్, ఏజీపీ మల్లేష్, గొరిగే కృష్ణ, కొంద్రు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

